30న యువ కవితా పోటీలకు ఆహ్వానం

ప్రజాశక్తి-కాకినాడ

ఉగాది సందర్భంగా రచయితల సంఘం, శ్రీవేణుగోపాల సంస్కృత ప్రచార సభ ఆధ్వర్యంలో ఈ నెల 30న నవ వసంతం-నవ మానవుడు అనే అంశంపై యువ కవితా పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 35 ఏళ్ల లోపు వయసు గల యువ కవుల నుంచి కవితలు ఆహ్వానిస్తున్నామన్నారు. పోటీలలో ఉన్న కవితలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వడమే కాక ఎంపిక చేసిన పది మంది కవులతో కవి సమ్మేళనం నిర్వహిస్తామని తెలిపారు. తమ కవితలను ఈ నెల 22వ తేదీ లోపు జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షులు మాకినీడి సూర్య భాస్కర్ వాట్సప్ నెంబర్ 9491504045కు వాట్సాప్ చేయాలన్నారు.

కంటి వైద్య సేవలకు మంగళం

- సిహెచ్‌సిల్లో మూతబడిన ఇ-ఐ కేంద్రాలు
- కంటి సమస్యలతో పేదలకు తప్పని అవస్థలు
- పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అంటారు. అన్ని అవయవాల్లో కళ్లు చాలా కీలకం. అటువంటి కంటి వైద్యంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కంటి సమస్యలతో బాధ పడే పేద, మధ్యతరగతి వర్గాలకు సేవలందించడానికి ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. దీనిలో భాగంగా ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాల ద్వారా కంటి పరీక్షలు చేసి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 25 సిహెచ్‌సిలలో సేవలు అందించేవారు. ప్రస్తుతం ఈ సేవలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గతేడాది సెప్టెంబర్ 4వ తేదీతో అపోలో సంస్థతో ఒప్పందం ముగియడంతో అప్పటినుంచి ఈ కేంద్రాలు మూతపడ్డాయి. 2018లో ప్రారంభించినప్పటికీ గత వైసిపి ప్రభుత్వంలో కంటి జబ్బులకు సంబంధించి ఒపి దగ్గర్నుంచి శస్త్రచికిత్సల వరకు అన్ని సేవలు ఉచితంగా అందించేవారు. ఆప్తాల్మిక్ అసిస్టెంట్లను కూడా నియమించారు. కొంతకాలం క్రితం వారిని తొలగించడంతో కాక వేతన బకాయిలను కూడా చెల్లించలేదు. ఈ-ఐ కేంద్రాల్లో సామగ్రి, వైద్య పరికరాలు, కంప్యూటర్లను కాంట్రాక్టు సంస్థ తరలించుకుపోయింది.

నిరాశతో వెనుతిరుగుతున్న రోగులు

అన్ని సిహెచ్‌సిలలో కంటి వైద్య సేవలకు మంగళం పాడడంతో పలువురు రోగులు ఆసుపత్రుల చుట్టూ తిరగలేకపోతున్నారు. కంటి వైద్య పరీక్షల కోసం ప్రతి రోజూ పదుల సంఖ్యలో పేద ప్రజలు వస్తున్నారు. వారికి కేంద్రాలు మూతపడిన సంగతి తెలియక నిరాశ చెందుతున్నారు. అత్యవసరంగా కంటి వైద్య పరీక్షలు అవసరమైన వారు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాల ద్వారా ఒప్పందం ముగిసేటప్పటికి దాదాపు 3 లక్షల మందికి కంటి చికిత్సలు అందించారు. ఒక్కో కేంద్రంలో రోజుకు 30 నుంచి 50 మంది వరకు ఒపిలు నమోదు చేసుకునేవారు. అన్నిరకాల పరీక్షలు చేసి అవసరమైన వారికి రెండు వారాల్లోపే కళ్లద్దాలు అందించేవారు. దీంతో ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలకు రోగుల నుంచి ఆదరణ పెరిగింది. కళ్లలో పొరలు, శుక్లాల సమస్యలు ఉన్నవారిని గుర్తించి జిల్లా ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించేవారు.

వ్యయ, ప్రయాసలు

ఈ కేంద్రాలు మూతపడడంతో పలువురు రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో అనేక వ్యయ, ప్రయాసలు తప్పడం లేదని వాపోతున్న పరిస్థితి ఏర్పడింది. ఒపి, ఇతర ఫీజులు, ఖర్చులను భరించలేక సామాన్య రోగులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. కంటి చికిత్సలకు ప్రైవేటు ఆస్పత్రుల్లో ఒపికి రూ.300 అవుతుంది. కళ్లద్దాలు కావాలంటే రూ.1000 నుంచి రూ.2000 అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఫలితంగా పేదలపై భారం పడుతోంది. ఈ సేవలను ఈ-ఐ కేంద్రాలను వెంటనే తెరిచేందుకు చర్యలు తీసుకోవాలని పేద, మధ్య తరగతి ప్రజలు కోరుతున్నారు. ఒప్పంద గడువు పొడిగించకపోవడంతో ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాల్లో 8 ఏళ్లుగా పని చేస్తున్న ఉద్యోగులు జీవనోపాధి కోల్పోయి ఇబ్బంది పడుతున్నారు. పేద ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం స్పందించి ముఖ్యమంత్రి ఈ-ఐ సేవలను తిరిగి పునరుద్ధరించాలని పలువురు సామాన్య రోగులు కోరుతున్నారు.

మూతపడిన పిఠాపురం సిహెచ్‌సిలోని ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రం

కంటి వైద్య సేవలను తిరిగి ప్రారంభించాలి

పిఠాపురం ఆస్పత్రిలో కంటి వైద్య సేవలను తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. నాలాంటి అనేకమంది పేదలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలంటే ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

- షేక్ కదార్ మున్నీసా, పిఠాపురం.

వైద్య సేవలందడం లేదు

గతంలో పిఠాపురం సిహెచ్‌సిలో కంటి వైద్యం చేసేవారు. పది రోజుల క్రితం వస్తే ఇక్కడ సేవలు అందడం లేదని చెప్పారు. దీంతో ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నాను. ఇప్పుడైనా వైద్యం చేస్తారేమో అనే ఆశతో వచ్చినప్పటికీ నిరాశ తప్పలేదు. వెనక్కి వెళ్ళిపోయాను.

- గరగా చక్ర లక్ష్మి, రోగి, పిఠాపురం.

ప్రభుత్వం తీరుపై వైసిపి యువత పోరు

ప్రజాశక్తి-కాకినాడ

గద్దెనెక్కి 9 నెలలు దాటినా హామీలు అమలు చేయని టిడిపి కూటమి ప్రభుత్వంపై వైసిపి యువత పోరు నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రామలింగేశ్వరరావు (రాజా) మాట్లాడుతూ తొమ్మిది నెలల కిందట అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమయ్యిందని దుయ్యబట్టారు. అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, ఉద్యోగ క్యాలెండర్ నోటిఫికేషన్, మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం, నిరుద్యోగ భతి, డిఎస్‌సి అమలు చేయలేదని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కాలేజీలను ప్రారంభించి అందులో నాలుగు కాలేజీలను పూర్తి చేశారని, మిగతా వాటిని కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడకుండా తమ అనుచరులకు కట్టబెట్టి ఆర్థికంగా లబ్ధి పొందడానికి చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి వాటిని ప్రశ్నించకుండా కొంతమంది ఆవిర్భావ సభలు పెట్టుకోవడం శోచనీయమని తెలిపారు. ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు తప్ప రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎలు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, వంగా గీత, తోట నరసింహం, ముద్రగడ పద్మనాభం, నాయకులు దవులూరి దొరబాబు, రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, సుంకర శివప్రసన్న తదితరులు పాల్గొన్నారు. తొలుత కాకినాడ బాలా త్రిపుర సుందరి ఆలయం వద్ద ఉన్న పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అక్కడ నుండి పెద్ద ఎత్తున కలెక్టర్ కార్యాలయానికి బయల్దేరారు. అక్కడ తమ నిరసన తెలిపారు. కలెక్టర్ షాన్ మోహన్‌కు వినతిపత్రం అందించారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వైసిపి శ్రేణులు

ప్రతీ గ్రామానికి అభివృద్ధి, సంక్షేమం చేరాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ప్రతి గ్రామానికీ అభివృద్ధి, సంక్షేమం చేరాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పని చేస్తున్నారని రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. బుధవారం కాకినాడ రూరల్ పండూరులో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో మంత్రి మనోహర్, రూరల్ ఎంఎల్‌ఎ పంతం నానాజీ, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కుడా చైర్మన్ తుమ్మల బాబు, పౌరసరఫరాల అధికారులు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. పింఛన్ల మంజూరు, డ్రైనేజీ, సిసి రోడ్ల నిర్మాణం, కలుషితమైపోయిన పండూరు చెరువును బాగు చేయడంతో పాటు చుట్టూ వాకింగ్ ట్రాక్, శ్మశాన వాటిక, తమ్మవరం భూములు వంటి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివద్ధి కార్యక్రమాలు ఎంతవరకు ప్రజలకు చేరుతున్నాయో, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను తెలుసుకునేందుకు రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఏప్రిల్ నుంచి కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు పంపిణీ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తుందని ఆయన తెలిపారు. మే నెలలో రూ.9,600 కోట్లతో తల్లి వందనం పేరుతో రూ.15 వేలు ఇస్తారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామపంచాయతీల్లో ఒకేరోజు గ్రామసభ నిర్వహించి, గ్రామ సభ తీర్మానాలు చేసి ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణం ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎం.దేవులా నాయక్, డిఎస్ఒ ఆర్‌ఎస్.సత్యనారాయణ రాజు, ఎంపిటిసి అనంతలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

రచ్చబండలో పాల్గొన్న మంత్రి నాదెండ్ల మనోహర్

గడ్డి మందు తాగిన కౌలు రైతు మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

అప్పుల బాధ తాళలేక గడ్డి మందు తాగిన కౌలురైతుచ పరిస్థితి విషమించడంతో బుధవారం కాకినాడ ఆసుపత్రిలో మృతి చెందాడు. మండలంలోని పి.మల్లవరం పంచాయతీ పత్తిగొందికి చెందిన పెచ్చెట్టి వెంకటేశ్వరరావు (45) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో సొంత భూమితో పాటు కొంత కౌలుకి తీసుకుని వ్యవసాయం చేశాడు. వ్యవసాయంలో నష్టం రావడం వల్ల అప్పులు తీరక కొంతకాలం హైదరాబాద్‌లో పని చేశారు. తిరిగి కాకినాడలో కూలి పని చేస్తున్నారు. మంగళవారం రాత్రి యానాం బీచ్‌కు చేరుకుని గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేశ్వరరావును యానాం పోలీసుల సహకారంతో కాకినాడలో ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. వెంకటేశ్వరరావుకు భార్య నాగలక్ష్మి, వివాహమైన కుమార్తెలు శ్రీదేవి, జ్యోతిశ్రీ ఉన్నారు.

యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవి శంకర్ తెలిపారు. ఈ ప్రోగ్రాంలో ముఖ్య అతిథులుగా గండేపల్లి ఎస్ఐ యువి.శివ నాగబాబు, పెద్దాపురం ఎస్ఐ వి.మౌనిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో ముచ్చటిస్తూ మన మాటల ద్వారా లేదా చర్యల ద్వారా ఇతర విద్యార్థిని వేధించినా, ఆటపట్టించినా, లేదా దురుసుగా ప్రవర్తించినా ర్యాగింగ్ పరిధిలోకి వస్తాయని తెలిపారు. విద్యార్థులకు ర్యాగింగ్ అనర్థాలపై పట్ల అవగాహన కల్పించారు. సీనియర్స్, జూనియర్స్ మధ్య స్నేహ భావం పెంపొందేలా కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవి శంకర్, యాంటీ ర్యాగింగ్ కమిటీ కోఆర్డినేటర్ విన్నీ థెరిసా, అధ్యాపకులు డాక్టర్ బిఎన్‌బి.వైదేహి, డాక్టర్ ఎన్.దివ్య, డాక్టర్ వేద ప్రియ, అమల, హేమ కిరణ్మయి, సాయి ప్రియాంక పాల్గొన్నారు.

నూతన దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో సోమలంక త్యాగరాజు వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం వృద్ధులకు నూతన వస్త్రాలు, భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్ మాట్లాడారు. వారిని స్మరించుకుంటూ వారి కుటుంబ సభ్యులు వృద్ధులకు నూతన వస్త్రాలు, భోజన ప్యాకెట్లు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ప్రముఖ సాహిత్య వేత్త డాక్టర్ శిరీష మాట్లాడారు.

ప్రజా చైతన్య యాత్రలో సమస్యల గుర్తింపు

ప్రజాశక్తి -కరప, కాకినాడ రూరల్

ప్రజా సమస్యలపై ప్రజా చైతన్య యాత్రలో భాగంగా కరప గ్రామంలో సిపిఎం బృందం బుధవారం పర్యటించింది. పార్టీ జిల్లా నాయకుడు ఎం.రాజశేఖర్ మాట్లాడారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని మురుగు నీరు నిల్వ ఉండి, ప్రజలు జ్వరాలు బారిన పడుతున్నారని, గంటాలమ్మ గుడి వద్ద నుయ్యి వద్ద డ్రైనేజీ లేక మురుగు నీరు పారక నిల్వ ఉండిపోతుందని ప్రజలు తమ గోడు వెల్లబుచ్చుతున్నారని రాజశేఖర్ తెలిపారు. నక్కా వారిపేటలో డ్రైనేజీలు ఉన్నా నీరు బయటకు వెళ్లే తూరలు మూసుకు పోయాయని, మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల చిన్నపాటి డ్రైనేజీలో నుండి పురుగులు రోడ్డుపైకి పాకుతున్నాయని తెలిపారు. ఒకే ఇంటిలో ముగ్గురు జ్వరాలతో బాధ పడుతున్నారని స్థానికులు కనికెళ్ల మహాలక్ష్మి, నక్కా పాప, నక్కా సత్యవేణి, బచ్చల కామేశ్వరి, మందనక్క గోవిందరాజు, మర్రి ప్రసాద్ పార్టీ నాయకులకు తెలిపారు.

కాకినాడ రూరల్ వ్యాపార సంస్థలకు విద్యుత్ స్మార్ట్ మిటర్లను బిగించారని, వాటి ఉద్దేశం వాటి పనితీరు ప్రజలకు అవగాహన లేక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. డిపాజిట్ల పేరుతో భారాలు ప్రారంభమయ్యాయని, భవిష్యత్తులో పెరిగే విద్యుత్ బిల్లుల భారాలు తట్టుకోలేమని ప్రజలు ఆందోళన వ్యకం చేస్తున్నారు. ఈ సందర్భంగా పార్టీ శాఖా కార్యదర్శి సిహెచ్.విజయ్‌కుమార్ మట్లాడుతూ స్మార్ట్ మీటర్ల బిగింపు షాపులతో ప్రారంభమై తరువాత ఇళ్ళకు, వ్యవసాయ పంపు సెట్లకు బిగిస్తారని తెలిపారు. మోడీ ప్రభుత్వ ఆదేశంతో రాష్ట ప్రభుత్వం అదానీతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 41 లక్షల 80 వేల మీటర్లు బిగించబోతుందన్నారు. ఈ వ్యవహారమంతా ప్రభుత్వ విద్యుత్ శాఖకు సంబంధం లేకుండా అదానీ సంస్థకు అప్పగించడం ప్రమాదమని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొనే ఆనేక సమస్యలను యాత్ర బందానికి వారు వివరించారు. ఇంద్రపాలెంలో నీటి సమస్య దారుణంగా ఉందన్నారు. ఈ యాత్రలో పార్టీ నాయకులు సిహెచ్.అజయ్ కుమార్, పెద్దింశెట్టి రామకృష్ణ, టి.రాజా, సూర్యం, వాసంశెట్టి చంద్రరావు, అనంత త్రిమూర్తులు పాల్గొన్నారు.

కాకినాడ ఇంద్రపాలెంలో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు

కరపలోని నక్కా వారి పేటలో పర్యటిస్తున్న రాజశేఖర్

నిధుల కోసం సిఎంకు వినతి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రోడ్లు, వంతెనల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు టిడిపి కాకినాడ రూరల్ నియోకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంత లక్ష్మి దంపతులు కోరారు. అసెంబ్లీ ఆవరణలో ముఖ్యమంత్రి చంద్రబాబును వారు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారను. రోడ్లు, కమ్యూనిటీ హాల్స్, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, అసంపూర్తిగా నిలిచిపోయిన కొంగోడు, గంగనాపల్లి బ్రిడ్జి, పరకాలువ బ్రిడ్జి, కొంగోడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధులు విడుదల చేయాలని వినతపత్రం ఇచ్చారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

ప్రజాశక్తి-శంఖవరం

రాష్ట్రంలో మహిళా సాధికారికత దిశగా తమ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని టిఎన్‌టియుసి ఉపాధ్యక్షుడు వెన్న శివ అన్నారు. బుధవారం అన్నవరం రాఘవేంద్ర రెసిడెన్సీలో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ అంశంపై, స్థానిక టిడిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెన్న శివ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలల కాలంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా అనేక సంక్షేమ పథకాలు పేద బడుగు బలహీన వర్గాలకు అందిస్తోందన్నారు. మహిళలకు స్వయం ఉపాధి కింద టైలరింగ్‌లో శిక్షణ ఇస్తారని, అనంతరం లబ్ధిదారులకు కుట్టు మిషన్లు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుభాష్ పాల్గొన్నారు.

సిపిఆర్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -కరప

గుండెపోటు వచ్చినప్పుడు సిపిఆర్ ద్వారా ప్రమాద స్థాయిని నుండి తప్పించే విధానంపై వేళంగి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రంగరాయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ సి.కామేశ్వరరావు సిపిఆర్‌పై అవగాహన కల్పించారు. పాఠశాలకు రూ.82 వేల విలువైన 100 కుర్చీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.బాలకృష్ణ, క్లబ్ అధ్యక్షులు చుంద్రు వెంకన్నరావు చౌదరి, డాక్టర్ బొండా వెంకన్న రావు, డాక్టర్ బి.సూర్యారావు ఇళ్ల రాజేష్, రాజేంద్ర, బి.భాస్కర్ రామన్, చంటిబాబు హెచ్‌ఎం భారతి పాల్గొన్నారు.

అసంపూర్తి గృహ నిర్మాణాలపై సమీక్ష

ప్రజాశక్తి-కాకినాడ

గృహ నిర్మాణ పథకంపై బుధవారం కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, జెసి రాహుల్ మీనాతో కలిసి సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2029 నాటికి అందరికీ ఇళ్లు నిర్మించాలనే ధఢ నిశ్చయంతో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. పిఎంఎవై గ్రామీణ్ 1.0, పిఎంఎవై అర్బన్ 1.0లో ఇళ్లు మంజూరై ఇంకా వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు యూనిట్ విలువకు అదనంగా ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. జిల్లాలో దాదాపు 7,108 మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసిల గృహాలు వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయన్నారు. గృహనిర్మాణం పూర్తికి యూనిట్ విలువ రూ.1.80 లక్షలకు అదనంగా ఎస్‌సిలు, బిసిలకు రూ.50 వేలు, ఎస్‌టిలకు రూ.75 వేలు, పివిటిజి (ఆదివాసీ గిరిజనులకు) రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం రాష్ట్ర ప్రభుత్వం అదనంగా అందిస్తోందని తెలిపారు. వీటి నిర్మాణాలను ఏప్రిల్ 2025 లోగా పూర్తి చేసుకోవాలన్నారు. దశల వారీగా అదనపు మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాకు నేరుగా జమ చేస్తారన్నారు. ఈ మేరకు లబ్ధిదారులు ఇల్లు పూర్తి చేసుకోవడానికి తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీ ఎన్‌వివి.సత్యనారాయణను కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 20వ తేదీ లోగా లబ్ధిదారులకు ఎఫ్‌టిఒ జనరేట్ చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జనసేన ప్రచార రథాలు ప్రారంభం

ప్రజాశక్తి -సామర్లకోట

జనసేన పార్టీ ప్రచార రథాలను ప్రారంభించామని పార్టీ జిల్లా అధ్యక్షుడు, కూడా చైర్మన్ తుమ్మల రామస్వామి తెలిపరాఉ. బుధవారం సామర్లకోట ఆంజనేయస్వామి ఆలయం వద్ద పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ప్రతి ఇంటికి, ప్రతి ఊరికి ఆహ్వానం వెళ్లే విధంగా రూపకల్పన చేశారు. ప్రతి ఇంటికి ఆహ్వాన పత్రికలు పంపామని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-కాజులూరు

రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారమే అంతిమ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని టిడిపి సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం అన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అసెంబ్లీ సమావేశాల్లో ఉన్నందున మంత్రి ఆదేశాల మేరకు గ్రామాల అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మండలంలోని గొల్లపాలెంలో జరిగిన మన గ్రామం - మన మంత్రివర్యులు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి పల్లెలే పట్టుకొమ్మలని, గ్రామాల అభివద్ధి తోనే దేశాభివద్ధి ముడిపడి ఉందన్నారు. గ్రామాల్లో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరించి ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు స్థానికులు మాట్లాడుతూ గ్రామంలో వేసవిలో తాగు నీటికి ఇబ్బంది పడుతున్నామని, శివారు ఆయకట్టుకు సాగునీటి ఎద్దడి ఉందని పలువురు రైతులు తెలిపారు. అర్హులైన వారికి పింఛన్లు, వ్యక్తిగత కుళాయిలు మంజూరు చేయాలని, రేషన్ కార్డులు మంజూరు చేయాలని, సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. తాగునీటికి సంబంధించి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు వివరిస్తూ గొల్లపాలెం గ్రామానికి తాగునీరు కోసం జల జీవన్ మిషన్ ద్వారా రూ.1.30 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, ట్యాంకు నిర్మాణం పూర్తి చేసి ప్రస్తుతం 430 కుళాయిలు వేశామని, రెండున్నర కిలోమీటర్లు మేర పైప్‌లైన్ వేయాల్సి ఉందని, పనులు వేగవంతం చేసి సమస్య వీలైనంత తొందరగా పరిష్కరిస్తామని తెలిపారు. సమస్యలన్నిటిని మంత్రి సుభాష్ దష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కారం అయ్యేందుకు కషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జె.రాంబాబు, హౌసింగ్ ఎఇ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ఎఇని వివరాలు అడుగుతున్న సత్యం

శానిటేషన్ వర్కర్స్‌కు జీతాలు పెంచాలి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ జిజిహెచ్‌లో శానిటేషన్ వర్కర్స్‌కు జీతాలు పెంచాలని సిఐటియు శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి, అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్‌కు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్‌కు కనీస వేతన జిఒ 2020 వచ్చిందని తెలిపారు. ఆ జిఒ ప్రకారం రూ.16 వేల జీతం ఉంటుందని పేర్కొన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ విషయంలో యజమానులు చెల్లించాల్సిన వాటా కూడా కార్మికుల జీతాల నుండే మినహాయించడం వల్ల నెలకు రూ.1600 ప్రతి కార్మికుడు నష్టపోతున్నట్టు తెలిపారు. జిఒ విడుదలై నాలుగేళ్లు గడిచిందని ఈ కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. అందువల్ల పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేల అమలు చేయాలని కోరుతున్నామన్నారు. దీనిపై సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి స్పందిస్తూ కార్మికుల కోర్కెలను డిఎంఇ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, యూనియన్ నాయకులు సిహెచ్.విజయ్ కుమార్, జె.శేషు, జె.లక్ష్మి ప్రియ, ఆర్.రమేష్, బి.మంగతాయారు, సిహెచ్.పుష్ప, మీసాల కుమారి, ఎస్.వాసు, బి.శ్రీకాంత్, డి.దుర్గాప్రసాద్, ఎం.రవి పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నేతలు

రాజుపాలెం రోడ్డు పనుల అడ్డగింత

ప్రజాశక్తి-కిర్లంపూడి

రాజుపాలెం-వీరవరం రహదారి పనులను స్థానికులు బుధవారం అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎంపిపి తోట రవి, తోట గాంధీ సంఘటన స్థలానికి చేరుకున్నారు. సైట్ ఇంజనీర్ శ్రీనుతో కలిసి రోడ్డు స్థలాన్ని పరిశీలించారు. స్థానికులకు ఇబ్బంది లేకుండా చేయడంతో వారు శాంతించారు. ఈ కార్యక్రమంలో గంధం ఈశ్వరరావు, పోకల దొరబాబు, గొడె దొరబాబు, సూరిబాబు పాల్గొన్నారు.

భోజనశాల షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మన పెద్దాపురం ఫేస్బుక్ బృందం మాతత్వం కార్యక్రమంలో గర్భిణులకు నిర్వహిస్తున్న అన్నదానం షెడ్డు నిర్మాణానికి బుధవారం దేవి సీఫుడ్స్ ప్రొడక్షన్ మేనేజర్ అనిల్, ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ జగదాంబ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మన పెద్దాపురం ఫేస్బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ ప్రతి బుధవారం వివిధ ప్రాంతాల నుండి ఈ ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య సేవలు, వివిధ పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, హెడ్ నర్స్ రమాదేవి, హెచ్‌డిఎస్ సభ్యులు సంజీవ కుమార్, స్టాఫ్ నర్స్ ఎస్‌వి.రమణ, మన పెద్దాపురం గ్రూప్ సభ్యులు లక్ష్మణ్ దివాకర్, నవీన్ నాని, వేముల చంద్రశేఖర్, సత్య ప్రశాంత్, జయశ్రీ, రత్నం, లక్ష్మి పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సభ్యులు

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

దాడి కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామంలోని ముస్లిం కాలనీలో మంగళవారం రాత్రి మైనార్టీ నాయకుడు జాఫర్ ఇంటిపై దాడి చేసిన కేసులో బుధవారం ముగ్గురు ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. వారిలో వెంకటాయపాలెం గ్రామం బొడ్డువారి పేటకు చెందిన పోతురాజు వినీల్ కుమార్, ద్రాక్షారామం ముస్లిం కాలనీ కి చెందిన ఇద్దరు మైనర్లను వేలంపాలెం రైల్వే ట్రాక్ వద్ద అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించామన్నారు. ఇద్దరు మైనర్లను జువెనైల్ జస్టిస్కోర్టు లో హాజరు పరిచినట్లు ఎస్ఐ వివరించారు.

నగల అపహరణపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సీతానగరం

బంగారు నగల అపహరణపై రఘుదేవపురం గ్రామానికి చెందిన ముత్తెపు నాగజ్యోతి బుధవారం సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్తతో కలిసి కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్నామని నాగజ్యోతి తెలిపింది. బుధవారం ఉదయం ఎప్పటిలానే కూలి పనులకు వెళ్లామన్నారు. తమ కుమార్తె తొమ్మిది గంటలకు ఇంటికి తాళం వేసి పాఠశాలకు వెళ్లిపోయిందని తెలిపింది. సాయంత్రం వచ్చే సరికి ఇంట్లోని నాలుగు జతుల బంగారు చెవిలీలు, ఒక బంగారు చైను, రూ.20 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.5 లక్షల నగదు అపహరణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరంలో ఒక ఇంట్లో రూ.5కేజీల నగదు, పదిన్నర సవర్ల బంగారు నగలు అపహరణకు గురయ్యాయి. ఈ మేరకు కేసు నమోదైందని ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఉండ్రాజవరం నిమ్మ తోటలో సీపాని చిరంజీవి, సీపాని విజయలక్ష్మిల కుటుంబం నివాసం ఉంటోంది. వారి కుమారుడి పెళ్లి నిమిత్తం ఇంట్లో రూ.5 లక్షల నగదు, పదిన్నర సవర్ల బంగారు నగలు ఉంచారు. మంగళవారం వారు బయటకు వెళ్లారు. ఈ సమయంలో వెనుక నుంచి ఇంట్లోకి చొరబడి బీరువాలో నగదు, నగలను అపహరించారు. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. ఘటనా స్థలాన్ని సిఐ తిలక్, పరిశీలించారు. క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

చోరీ చేసిన 50 సెల్‌ఫోన్ల రికవరీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం సర్కిల్ పరిధిలోని రామచంద్రపురం, మండపేట ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారి ఫిర్యాదుల మేరకు వాటి రికవరీ కార్యక్రమం చేపట్టినట్లు డిఎస్‌పి రఘువీర్ బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి మొత్తం 50 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఫిర్యాదులు చేసిన వారి వివరాలు ఆధారంగా ఐఎంఐ నెంబర్ అనుసంధానం చేసి తిరిగి యజమానులకు వాటిని అందజేస్తామని ఆయనను వివరించారు. రామ చంద్రపురం, మండపేట సిఐలు సహకరించారని ఈ సందర్భంగా డిఎస్‌పి తెలిపారు. పలు సెల్‌ఫోన్లను ఆయా వినియోగదారులకు ఇప్పటికే అంజేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం సిఐ వెంకటనారాయణ, ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

వైసిపి ఆవిర్భావ ఉత్సవాలను బుధవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

తాళ్లరేవు వైసిపి మండల అధ్యక్షుడు కాదా గోవింద్ కుమార్ అధ్యక్షతన తాళ్ళరేవు చెరువుగట్టు సెంటర్లో వైఎస్ఆర్ విగ్రహం వద్ద భారీ కేక్ కట్ చేసి, పలువురికి స్వీట్లు పంపిణీ చేశారు. వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి చింతలపాటి శ్రీనివాసరాజు, జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్ పూలమాలలు వేశారు. పెట్ల సూర్యనారాయణ రాజు, సర్పంచులు ముద్దన శివరామ ప్రసాద్, వెంటపల్లి నూకరాజు, పంపన రామకృష్ణ, వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్ర ప్రసాద్, కొపనాతి నాగరాజు, కె.కిరణ కుమారి, గుత్తుల శ్రీనివాస్, పి.రత్నకుమారి, లోకేష్, ఆదినారాయణమూర్తి, ఆకుల వెంకన్న, రెడ్డి నాగేశ్వరరావు, రెడ్డి సతీష్, కట్టా దుర్గారావు, బొంతు మోహన్, దడాల జగదీశ్వరరావు పాల్గొన్నారు.

సామర్లకోట నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, ఊబా జాన్ మోజెస్, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, పాగా సురేష్ కుమార్, తలారి దొరబాబు, దవులూరి సుబ్బారావు, మన్యం చంద్రరావు, పాలిక కుసుమ చంటిబాబు, రూప సురేష్, నేతల హరిబాబు, లింగం శివప్రసాద్, మద్దాల శ్రీను పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో..

జగ్గంపేటలో పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం ఆధ్వర్యంలో మెయిన్ సెంటర్‌లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒమ్మి రఘురాం, ఎంపిపి చల్లగళ్ల దొరబాబు, రావుల గణేష్ రాజా, కరటూరి వీర్రాజు, కాపవరపు వరప్రసాద్ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్‌లో వైసిపి ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ప్రత్తిపాడు కిర్లంపూడిలో మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం, ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గౌతు స్వామి, ఎంపిపి గోళ్ల క్రాంతి సుధాకర్, జెడ్‌పిటిసి బెహరా రాజేశ్వరి, దొరబాబు, సర్పంచ్ గుడాల వెంకటరత్నం, జల్లిగంపల ప్రభాకర్ రావు, రామిశెట్టి నాని పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ పార్టీ సీనియర్ నాయకులు కురసాల సత్యనారాయణ, జెడ్‌పిటిసి నురుకుర్తి రామకృష్ణ, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ రమణయ్యపేట వైద్యనగర్‌లోని కురసాల కన్నబాబు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. గోపిశెట్టి బాబ్జి, పుల్ల చందు, అనుసూరి ప్రభాకర్, జమ్మలమడక నాగమణి, ఎం.కృష్ణంరాజు, నల్ల రాణి, భువనేశ్వరి, కొప్పిశెట్టి భవాని పాల్గొన్నారు.

యానాం వార్తలు

బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న ముఖ్యమంత్రి రంగసామి

రూ.13,600 కోట్లతో పుదుచ్చేరి వార్షిక బడ్జెట్

ప్రజాశక్తి - యానాం

రూ.13,600 కోట్లతో కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి వార్షిక బడ్జెట్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి ప్రవేశపెట్టారు. పుదుచ్చేరి స్వంత ఆదాయ వసూళ్లు సుమారు రూ.7,641 కోట్లుగా అంచనా వేసినట్లు తెలిపారు. రాష్ట్ర విపత్తు సహాయనిధితో సహా కేంద్ర సహాయం రూ.3,432.18 కోట్లు, సెంట్రల్ ఫండ్ రూ.25 కోట్లు, కేంద్రప్రాయోజిత పథకాల కింద రూ.400 కోట్లు అంచనా వేసినట్లు తెలిపారు. ఆర్థిక లోటు అంతరాన్ని పూడ్చేందుకు రూ.2,101.42 కోట్లు మేరకు చర్చలు జరిపిన రుణం సీలింగ్ కేంద్రప్రభుత్వం తన ఆమోదాన్ని తెలిపినట్లు తెలిపారు. రూ.13,600 కోట్ల బడ్జెట్ అంచనాలతో రూ.11,624.72 కోట్లు ఆదాయ వ్యయానికి రూ.1.975 కోట్లు మూలధన వ్యయానికి వ్యతిరేకంగా మూలధన వ్యయ శాతాన్ని గణనీయంగా 9.80 శాతానికి పెంచినట్లు తెలిపారు. 2021-22లో 1.86 శాతంగా ఉందని ఇది దాదాపు పది రెట్లు పెరిగిందన్నారు.

బడ్జెట్లో యానాంకు ప్రాధాన్యత

ఫ్లడ్ ప్రొటక్షన్ వాల్‌కు సహాయం, యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో పాత ఒపిడి బ్లాక్‌లో డయాలిసిస్ యూనిట్ ఏర్పాటు, సిటీస్కాన్, ఒపిజి ఎక్స్ రే మిషన్, మొబైల్ ఎక్స్ రే యూనిట్ నెలకొల్పేందుకు బడ్జెట్లో నిధులు కేటాయించారు. లాబొరొటరీస్‌ను ఆధునికం చేసే విధానంలో భాగంగా ఆర్ఎన్ఐసిపీ, ఎయిడ్స్ కంట్రోల్, ఫైలేరియా, మలేరియా, ఐడిఎస్‌పి యూనిట్లు నెలకొల్పనున్నారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర నిధులతో సెంట్రల్ ఫండ్ రూ.20 కోట్లతో రహదారుల అభివద్ధికి నిధులు, రూ.8.78కోట్లతో 5 ఎమ్ఎల్‌డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, 6ఎమ్ఎల్డీ కెపాసిటీతో మెట్టకూరు ప్రాంతంలో స్వీయేజ్ ఏర్పాటు, యానాం విద్యార్థులకోసం వరల్డ్ టూరిజం డే రోజున పర్యటనలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు.

ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-కిర్లంపూడి

మండలంలో ఎస్.తిమ్మాపురం, బూరుగుపూడి, చిల్లంగి గ్రామాల్లో భూసార పరీక్షా ఫలితాలపై రైతులకు బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించినట్లు ఎఒ జోకా అమృత తెలిపారు. డిప్యూటీ డైరెక్టర్ డిఆర్‌సి హరి, ఎఒ డిఆర్‌సి సంజీవ్, ఎఒ ఎస్‌టిఎల్ ఎన్.సుధా మాధురి అధికారులు రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు భూసార పరీక్షల అనంతరం ఫలితాలను ఆధారంగా చేసుకుని రైతులు తమ పొలాలలో ఎంతెంత మోతాదులో ఎరువులు వేయాలో వివరించారు. సమస్యాత్మక భూములు, చౌడు భూములు, ఆమ్ల భూముల యాజమాన్యం గురించి వివరించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-పెద్దాపురం

క్రాప్స్ ఆధ్వర్యంలో కల్వరి మిరాకిల్ చర్చ్ ప్రాంగణంలో క్రాప్స్ సెక్రటరీ నాగ శ్రీనివాస్ జిమ్స్ అధ్యక్షతన బుధవారం 70 మంది విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లాప్స్ వ్యవస్థాపకులు డాక్టర్ లంక పురుషోత్తమ దాస్ మాట్లాడుతూ క్లాప్స్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులకు ఈ కిట్లు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డిపిడికె జార్జ్ మేషన్, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ డిఎస్‌పి.రావు, అధ్యక్షుడు జి.సత్యానందం, బైబిల్ మిషన్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ జి.ఆర్ ఇమ్మానియేల్ రాజ్ కుమారుడు జి.జాన్ మోసెస్ దాస్, వైస్ ప్రెసిడెంట్ ఎల్.జ్ఞానానందం, కన్వీనర్ డాక్టర్ సిబిఐ సుకుమార్, పాల్గొన్నారు.

ఆదిత్యలో జీవిత నైపుణ్యాలపై ఉపన్యాసం

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య విశ్వవిద్యాలయం-వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'జీవిత నైపుణ్యాలు, ఉద్యోగ నైపుణ్యాలు' అనే అంశంపై డాక్టర్ మహమ్మద్ హుస్సేన్ బుధవారం అతిథి ఉపన్యాసం ఇచ్చారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు జీవితంలో ప్రతిస్పందించే నైపుణ్యాలను, ఉద్యోగ ప్రాప్తికి అవసరమైన నైపుణ్యాలను గురించి చర్చించారు. ఈ ఉపన్యాసంలో ప్రముఖ అధ్యాపకులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఇంజనీరింగ్ స్కూల్ డీన్ డాక్టర్ డోలా సంజయ్ మాట్లాడుతూ ఇటువంటి ఉపన్యాసాలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కలగడమే కాక వారి సందేహాలను నివృత్తి చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ వి.సాయికృష్ణ, అధ్యాపకులు ప్రోగ్రాం కో ఆర్డినేటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్.మానస పాల్గొన్నారు..

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

ఈ నెల 18న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాల నిమిత్తం మినీ జాబ్ మేళా నిర్వహిస్తునట్లు జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు, కాలేజీ ప్రిన్సిపల్ దేవరపల్లి చెన్నారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో వరుణ్ మోటార్స్, డైకిన్, ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్, మెడ్ ప్లస్ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. వివిధ ఉద్యోగాలు పొందేందుకు టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీపూర్తి చేసిన 19 నుంచి 35 ఏళ్ల స్త్రీ, పురుషులు అర్హులన్నారు. జాబ్ మేళాలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తి అర్హతలు గల అభ్యర్థులు https://naipunyam.ap.gov.inలో తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయ్యి, రెజ్యూమ్‌తో పాటు ఆధార్, సర్టిఫికెట్లు జిరాక్సు కాపీలతో హాజరవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు 8688977277, 8247788247 నంబర్లలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు సంప్రదించాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-ఏలేశ్వరం

కూటమి ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వం అని ఏలేశ్వరం ఎంపిపి గొల్లపల్లి బుజ్జి అన్నారు. మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు సిబ్బందికి బుధవారం ఆయన శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ దాళ్వా పంట కోత దశకు చేరుకున్నందున రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ఎటువంటి ఆటంకాలూ లేకుండా కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లోగా రైతులకు డబ్బు చెల్లిస్తుందన్నారు. రైతులు దళారుల పాలు పడకుండా కొనుగోలు సిబ్బంది ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో వారికి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఒ జి.రవి, సివిల్ సప్లై సిబ్బంది ఎస్.దుర్గాప్రసాద్, పి.నాగప్రసాద్ పాల్గొన్నారు.

పంపా ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన

శంఖవరం : అన్నవరంలోని పంపా ప్రాజెక్టుకు సంబంధించి వివిధ అభివృద్ధి పనులకు ఇరిగేషన్ అధికారులు బుధవారం శంకుస్థాపన చేశారు. బుధవారం పంప ఇరిగేషన్ కార్యాలయం వద్ద చైర్మన్ బైరావర్జుల శ్రీరామచంద్రమూర్తి అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. టిడిపి నాయకుడు యనమల రాజేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ పంపా ప్రాజెక్ట్ పరిధిలో కొన్నేళ్ల నుంచి ఇటువంటి అభివృద్ధి పనులు చేయలేదని, కూటమి ప్రభుత్వం రాగానే తుని, ప్రత్తిపాడు ఎంఎల్ఎల సహకారంతో ఎస్‌టిఎంఎఫ్ నుంచి రూ.3.99 కోట్ల నిధులు మంజూరు కాగా కార్యాలయం బిల్డింగ్, గేట్లు ఫ్లడ్ కంట్రోల్ రూమ్ వంటి అభివృద్ధి నిర్మాణ పనులు చేపడతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఇఇ శేషగిరిరావు, డిఇ సంతోష్, ఎఇ పద్మజ శ్రీదేవి పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

రౌతులపూడి : మహిళల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు తెలిపారు. బుధవారం రౌతులపూడి మండల టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షుడు సత్యనారాయణ, ఎంపిపి గంటిమల రాజ్యలక్ష్మి, వివిధ గ్రామాల టిడిపి నాయకులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇచ్చిన హామీలు అమలు చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

రైల్వే జిఎం ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట రైల్వే స్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఇతర అధికారులతో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ప్రత్యేక రైలులో స్టేషన్‌కు చేరుకున్న జిఎంకు స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం జిఎం అరుణ్ కుమార్ జైన్ రైలు ట్రాక్‌లు, వంతెనలు, సిగ్నలింగ్ వ్యవస్థల నిర్వహణకు సంబంధించిన భద్రతా అంశాలను పరిశీలించారు. స్టేషన్‌లో ప్రయాణికులకు కల్పించిన సౌకర్యాలు, అభివృద్ధి పనులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారుర. ఆయన వెంట పిసిఒఎం కె.పద్మజ, పిసిఎస్ఒ కె.వెంకట రమణ రెడ్డి, సిఒఎం బి.రవిచందర్, పిసిఇఇ బ్రిజ్ మోహన్ మీనా, సీనియర్ డిఒఎం నరేంద్ర వర్మ, డిసివిఎం రాంబాబు పాల్గొన్నారు.

వెరిఫికేషన్ సర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్న వెరిఫికేషన్ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో మండల పరిధిలోని సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పొజిషన్ సర్టిఫికెట్లు, ఇంటి పట్టాలు, ఆక్రమణ స్థలాలు, హౌస్ సైట్లు రీ వెరిఫికేషన్ తదితర అంశాలకు సంబంధించిన అన్ని సర్వేలూ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దారు కాంతారావు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు దుర్గా భవాని, మండల సర్వేయర్ సామోరు పాల్గొన్నారు.

మండల కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజా సమస్యలపై తహశీల్దారు కార్యాలయంలో బుధవారం మండల కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు.కమిటీ కన్వీనర్, తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల పరిధిలోని రాయభూపాలపట్నంలో భూ వివాదానికి సంబంధించి కోర్టు వివాదంలో ఉన్న సమస్యపై చర్చించారు. సమన్వయ కమిటీ సభ్యులు ఎంపిడిఒ డి.శ్రీలలిత, ఎస్ఐ వి.మౌనిక పాల్గొన్నారు.

నేడు ప్రజాప్రతినిధులకు శిక్షణ

ప్రజాశక్తి - చాగల్లు

స్థానిక ప్రజాప్రతినిధులకు గురువారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం జరుగుతుందని ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి తెలిపారు. చాగల్లు మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిక్షణా తరగతులకు ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు. గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిక్షణలో 2025-26 గ్రామపంచాయతీ వార్షిక ప్రణాళికలు తయారీ, మార్గదర్శకాలు వంటి వాటిపై అవగాహన కల్పిస్తామన్నారు.

ఉండ్రాజవరం : స్థానిక ప్రజాప్రతినిధులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం ఎంపిడిఒ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వివివిఎస్.రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రసూతి సెలవులు ఇవ్వాలి

ప్రజాశక్తి- కడియం

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మేటర్నిటీ లీవ్‌కు సంబంధించిన ప్రకటన హర్షించదగ్గ విషయమని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు పి.రవికుమార్ అన్నారు. ఎన్ని కాన్పులుకైనా ఈ లీవును వర్తింప చేయడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

5వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి మెయిన్ బజార్‌లో మదన గోపాలస్వామి ఆలయం వద్ద బుధవారం 5వేల మందికి అన్నదాన నిర్వహించారు. మదన గోపాలుని వార్షిక కళ్యాణోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ఉత్సవ కమిటీ చైర్మన్ సింహాద్రి జనార్ధన్‌రావు తెలిపారు.

పరీక్షలకు 16 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - చాగల్లు, తాళ్లపూడి

చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో బుధవారం జరిగిన ఇంటర్ పరీక్షలకు 16 మంది గైర్హాజరయ్యారు. చాగల్లు శ్రీవెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు ఐదుగురు గైర్హాజర్యారని ప్రిన్సిపల్ కె.పావని తలెఇపారు. 104 మంది విద్యార్థులకు 99 మంది హాజరయ్యారన్నారు. తాళ్లపూడిలో 11 మంది విద్యార్థులు ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు కాకినాడ జిల్లా, పేర్రాజుపేట కాపురస్తులు శ్రీ కోసూరి శేషారావు గారి కుమారుడు **కోసూరి మాధవరావు** అనువారు మాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికీ తెలియజేయునది ఏమనగా,

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి శ్రీ ముమ్మిడి వీరరాఘవులు గారి కుమారుడు ముమ్మిడి దుర్గరాజు గారి యొక్క స్వార్జిత బాపతు ఆస్తి అయి ఉన్నది. అనగా వారు ది.18-06-2011 సం॥రం తేదీన రావికొండలరావు రాగాల గారి తరపున పవర్ ఆఫ్ అటార్నీ హోల్డరు అయినటువంటి చోడిశెట్టి శ్రీనివాసరావు గారి వద్ద క్రయం పొంది క్రయ దస్తావేజు నెం.**4840/2011**రుగా రిజిష్టరు పొందినటువంటి ఆస్తి అయిఉన్నది. సదరు ఆస్తిని వారు అమ్మజూపగా మా క్లయింటు కొనుగోలు చేయుటకు ఒప్పందం కుదుర్చుకొని కొంత రొక్కము అడ్వాన్సు రూపేణా వారికి ఇచ్చి క్రయ అగ్రిమెంటు పొంది యున్నారు. కావున ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైనా ఎట్టి అభ్యంతరములు గాని, కోర్టు జప్తులు గాని, తనఖాలు గాని మరియే ఇతర ఆక్షేపణలు ఉండియున్న యెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి ఒక వారం రోజులలోపు సరియైన సాక్ష్యాధారములతో ఈ క్రింది చిరునామాకు లిఖిత పూర్వకంగా తెలియజేయవలెను. ఎట్టి అభ్యంతరములు రాని యెడల సదరు ఆస్తి నిష్పేచీ ఆస్తిగా భావించి మా క్లయింటు సదరు ఆస్తిని కొనుగోలు చేసి క్రయదస్తావేజు పొందుదురు అని తెలియజేయడం అయినది. గడువు తేదీ తరువాత వచ్చు అభ్యంతరములు మా క్లయింటును ఏ విధంగానూ బైండు చేయజాలవు అని తెలియజేయడమైనది.

షెడ్యూలు: కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం, కాకినాడ సబ్-రిజిస్ట్రారులో చేరిన, ఎస్.అచ్యుతాపురం గ్రామం తాలూకా, మధురానగర్‌లో స.నెం.162రులో ప్లాటు నెం.794రు తాలూకు చ॥గ॥ 209లు ఖాళీ స్థలమునకు హద్దులు కొలతల వివరములు:

తూర్పు: అ॥ 57లు - ప్లాటు నెం.793రు స్థలం, **పడమర:** అ॥ 57లు - ప్లాటు నెం.795రు స్థలం, **ఉత్తరం:** అ॥ 33లు - 33 అ॥లు వెడల్పు గల రోడ్డు, **దక్షిణం:** అ॥ 33లు - ప్లాటు నెం.782రు స్థలం. సదరు హద్దుల మధ్యస్తము అయిన చ॥గ॥ 209లు ఖాళీ స్థలము అందలి సర్వం సహా.

కాకినాడ
ది.12-03-2025

మల్లిపూడి కనకదుర్గ
పాకలపాటి అశోక్‌బాబు
న్యాయవాదులు, డో.నెం.7-8-2, రామారావుపేట
కాకినాడ - 533 004, సెల్: 9059969688

గ్రామపంచాయతీ కార్యాలయం, చిలకపాడు
ఉండ్రాజవరం మండలం, తూర్పుగోదావరి జిల్లా

టెండరు ప్రకటన

రిక.నెం. /2025 తేది.10-03-2025

తూర్పుగోదావరి జిల్లా, ఉండ్రాజవరం మండలం, చిలకపాడు గ్రామపంచాయతీ నందు 2025-2026 సంవత్సరమునకు అనగా ది. 01-04-2025 నుండి 31-03-2026 వరకు ఈ దిగువ ఉదహరించిన పనులు చేయుటకు టెండర్లు పిలుచుటకు ది. 17-03-2025 వరకు టెండర్లు స్వీకరించబడి, అదేరోజు ఉదయం 10.30 లకు టెండర్లు పంచాయతీ కార్యదర్శి వారిచే గాని, లేక అధిరానం ఇవ్వబడిన వారిచే గాని టెండర్లు తెరవబడును. టెండర్లు దాఖలు చేయువారు షెడ్యూల్ నందు చూపబడిన టెండర్లు డిపాజిట్లు చెల్లించి రశీదు జతపరచవలెను. ఇతర వివరములు కార్యాలయం పని వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు

వ.నెం.	వివరములు	చెల్లించవలసిన ధరావత్తు
1	ప్రజారోగ్య పారిశుద్ధ్య నిర్వహణ - 3	రూ. 100/- (1కి)
2	రక్షిత మంచినీటి పథకములు నిర్వహణ - 2	రూ. 100/- (1కి)
3	వీధి దీపములు రిపేరు చేయుటకు - 1	రూ. 100/- (1కి)
4	బుక్స్ & స్టేషనరీ సామాన్లు సరఫరా	రూ. 200/-
5	విద్యుత్ విడి పరికరములు కలెక్టర్ అప్రూవల్ ఆథరైజ్డ్ డీలర్లు మాత్రమే	రూ. 200/-
6	పి.హెచ్. సామానులు సప్లయి	రూ. 200/-

పై అయిటముల కాలపరిమితి 2025-2026 అనగా 01-04-2025 నుండి 31-03-2026 వరకు.

సం/- **టి.వి.సూర్యకుమారి,** సర్పంచ్, గ్రామపంచాయతీ, చిలకపాడు, ఉండ్రాజవరం, తూర్పుగోదావరి జిల్లా

సం/- **చోళ్ళ రాజు,** పంచాయతి కార్యదర్శి, గ్రామపంచాయతీ, చిలకపాడు, ఉండ్రాజవరం, తూర్పుగోదావరి జిల్లా

గ్రామపంచాయతీ కార్యాలయం, ఏడిద

టెండరు ప్రకటన

రిక.నెం. 20/2025 తేది.12-03-2025

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండపేట మండలంలోని ఏడిద గ్రామపంచాయతీకి 2025-2026 సం॥నకు గ్రామపంచాయతీకి అవసరమగు యీ దిగువ చూపిన అయిటములు దాఖలా సామాగ్రి సరఫరా చేయుటకు ది. 24-3-2025వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3.00 గం॥ల వరకు టెండర్లు స్వీకరించబడును. తదుపరి మధ్యాహ్నం 3.30 గం॥లకు అప్పటికి హాజరైన టెండరుదార్లు సమక్షమున సీల్డు టెండర్లు తెరువబడును. టెండర్లు దాఖలు చేయువారు నిర్ణీత ధరావత్తు చెల్లించి క్రమమైన రశీదు పొంది రశీదును టెండరు దరఖాస్తుతో జతపర్చి దాఖలు చేయవలెను. మిగిలిన కార్యాలయం పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును. టెండర్లు ఆమోదించుటకు గాని, నిరాకరించుటకు గాని పంచాయతీ కార్యదర్శి వారికి పూర్తి అధికారము కలదు.

షెడ్యూలు-1

వ.నెం.	టెండరు వివరములు	చెల్లించవలసిన ధరావత్తు
1	2025-2026 సం॥రంనకు కార్యాలయమునకు అవసరమగు స్టేషనరీ సరఫరా చేయుటకు	రూ. 500/-
2	2025-2026 సం॥రంనకు అవసరమగు ప్రజారోగ్య సామాగ్రి మరియు క్రిమి సంహారక మందులు సరఫరా చేయుటకు	రూ. 500/-
3	2025-2026 సం॥రంనకు అవసరమగు చేతి పంపుల విడిభాగములు సరఫరా మరియు రక్షిత మంచినీటి సరఫరా పథకమునకు విడిభాగములు సరఫరా చేయుటకు	రూ. 500/-
4	2025-2026 సం॥రంనకు అవసరమగు వీధి విద్యుత్ పరికరాల (ఎలక్ట్రికల్) విడిభాగములు సరఫరా చేయుటకు	రూ. 500/-
5	2025-2026 సం॥రంనకు ప్రజారోగ్య పనులు చేయుటకు గాను 20 మంది సిబ్బంది (ప్రతి మనిషి విడివిడిగా దాఖలు చేయవలెను)	రూ. 100/-
6	2025-2026 సం॥రంనకు చేతి పంపుల రిపేరు చేయుటకు గాను ఒక మనిషి సేవలు	రూ. 100/-
7	2025-2026 సం॥రంనకు రక్షిత మంచినీటి పథకం ఆపరేటు చేయుటకు గాను ముగ్గురు సేవలు (ప్రతి మనిషి విడివిడిగా దాఖలు చేయవలెను)	రూ. 100/-
8	2025-2026 సం॥రంనకు కార్యాలయ నైట్ వాచ్‌మెన్ సేవలు ఒక మనిషి	రూ. 100/-
9	2025-2026 సం॥రంనకు శానిటరీ మేస్త్రీ ఒక మనిషి సేవలు	రూ. 100/-
10	2025-2026 సం॥రంనకు ట్రాక్టరు డ్రైవరు సేవలు - 2 (ఇద్దరు)	రూ. 100/-
11	2025-2026 వీధి విద్యుత్ దీపముల రిపేర్ సేవలు చేయుటకు గాను ఒక మనిషి సేవలు	రూ. 100/-

గమనిక: 1. అయిటం నెం. 5, 6, 7, 8, 9, 10, 11 నకు ప్రస్తుతం పనిచేయువారు దాఖలు చేయు టెండర్లుకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వబడును. 2. అయిటం నెం. 10 నకు టెండరు దాఖలు చేయగోరు వారు ప్రభుత్వం వారిచే జారీ చేయబడిన హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కల్గిన వారై ఉండవలెను.

సం/- **పి.శ్రీనివాస్,** పంచాయతి కార్యదర్శి, గ్రామపంచాయతీ, ఏడిద

సం/- **బూరిగ ఆశీర్వాదం,** సర్పంచ్, గ్రామపంచాయతీ, ఏడిద

ఒరిజినల్ మార్కుల మెమోలు పోయినవి

తూర్పుగోదావరి జిల్లా, పెరవలి మండలం, నల్లాకులవారిపాలెం గ్రామానికి చెందిన కోపెల్ల శేష సాయి పృధ్వి నాయుడు కు చెందిన ఒరిజినల్ బీ.టెక్ మార్కుల మెమోలు నెం- 17A81AO365 జిరాక్స్ నిమిత్తం నల్లాకులవారిపాలెం గ్రామం నుండి పెరవలి జాతీయ రహదారి మీద వస్తుండగా మార్గ మధ్యలో పడిపోయినవి. దొరికిన వారు క్రింది అడ్రస్కు అందజేయగలరు.

అడ్రస్:
కోపెల్ల శేష సాయి పృధ్వి నాయుడు
S/o. కోపెల్ల శ్రీనివాస్, డోర్ నెం -1-63
నల్లాకులవారిపాలెం గ్రామం
పెరవలి మండలం
తూర్పుగోదావరి జిల్లా పిన్ -534328
ఫోన్ -9398192317

దస్తావేజు పోయినది

నాకు చెందిన పిఠాపురం మండలం, లక్ష్మీనరసాపురం గ్రామము తాలూకు బెజవాడ సత్యవతి & అదర్స్ నుండి డో.నెం 4-22 రు, సర్వే నెం. 343 రు, చ॥గ॥ 145లు ల ఇంటికి చెందిన **ఒరిజినల్ దస్తావేజు తేది. 09-03-2025, ద. నెం. 210/2023 రు,** గలది ది. 04-03-2025 సం॥రం తేదీన లక్ష్మీ నరసాపురం గ్రామము నుండి నా భర్త గారికి చెందిన వెహికల్‌పై వెళుతుండగా కవరులో పెట్టిన ఒరిజినల్ దస్తావేజు విరవాడ గ్రామము మెయిన్‌రోడ్డు వద్దకు చేరుకొను సరికి చూచుకొనగా దారిలో ఎక్కడో పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు అందజేయగలరు.

అందజేయవలసిన చిరునామా:
సాన లక్ష్మావతి
W/o. శ్రీనివాసు, ఎల్.ఎన్.పురం
పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా
సెల్: 94936 52429

నోటీసు
మహారాజశ్రీ ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. No. 2/2023 in O.S. No. 140/2019

Between:
రిమ్మలపూడి అమ్మాజి, భర్త: వీర్రాజు, హిందువు, వయస్సు 48 సం॥లు, హౌస్ వైఫ్, డోర్ నెం. 22-4-6, మండపేట, తూర్పుగోదావరి జిల్లా (ప్రస్తుతం కోనసీమ జిల్లా), ఆంధ్రప్రదేశ్, ఆలమూరు JCJ. -పిటీషనర్/ డిక్రీ హోల్డర్

మరియు

తేజోమూర్తుల వల్లి కామేశ్వరి సుబ్బలక్ష్మి, భర్త: తేజోమూర్తుల శ్రీనివాసరావు (లేటు), హౌస్ వైఫ్, డోర్ నెం. 47-4-31, మండపేట, తూర్పుగోదావరి జిల్లా (ప్రస్తుతం కోనసీమ జిల్లా), ఆంధ్రప్రదేశ్, ఆలమూరు JCJ. -రెస్పాండెంట్/ జడ్జిమెంట్ డెబ్టర్

పై పిటీషనర్ డిక్రీ బాకీ వసూలు నిమిత్తం రెస్పాండెంట్/ జడ్జిమెంట్ డెబ్టర్ భర్త అయిన తేజోమూర్తుల శ్రీనివాసరావు గారి డెత్ బెనిఫిట్స్‌ను I.A. No. 531/2019 in O.S. No. 140/2019 రూగా తోడజప్తు చేసిన వాటిని గార్నిషీ వద్ద నుండి పై కోర్టు వారికి పంపించమని పై E.P. గ్రంధమును దాఖలు చేసియున్నారు. సదరు పై E.P. గ్రంధములో మీకు పలుమార్లు నోటీసులు పంపినప్పటికీ మీరు వాటిని తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున, పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియపరచవలసినదిగా పై కోర్టు వారు ఆదేశించినందున, మీకు ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా, పై E.P. గ్రంధములో మీకు ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే, **తేదీ 28-03-2025వ తేదీన పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం గం॥ 10.30 నిమిషములకు** హాజరై మీ వాదనను తెలియపరచుకోవలెను. లేని యెడల పై కోర్టు వారు మీకు పరోక్షముగా నిర్ధారించబడునని మీకు తెలియపరచడమైనది.

వి.ఎస్.ఎన్.చౌదరి
అడ్వకేట్, మండపేట-533308

NOTICE
In the Court of the V Addl. Judicial 1st Class Magistrate, Kakinada
O.S. No. 977/2024

Between:
Nulukurthi Veera Raghava Rao, S/o. late Krishna Murthy, D.No. 3-218, Indrapalem, Kakinada Rural Mandal, Kakinada ...Plaintiff

AND

Adapa Chakra Rao, S/o. Rama Rao, aged 51 years, Tapi Mastry, Adapa vari Veedhi, Karakuduru, Pedapudi (M), Kakinada Dt., ...Defendant

Whereas the Plaintiff filed the above suit the Plaintiff against and another for recovery of the suit loan and other reliefs. The above suit is posted **to 27-3-2025** for your appearance with your defendance if any **at 10.30 A.M.** on the above said date before the Hon'ble Court failing which the suit and will be heard determined with costs.

(By Order of the Hon'ble Court)

P.V.V.SATYANARAYANA MURTHY
Advocate, D.No. 2-36,
Madhura Nagar, Kakinada,
Cell: 9490645636

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
Arbitration Appeal No. 7/2023

Between:
Seva Sugunakar ...Appellant

AND

M/s. Shriram Finance Limited & 2 others ...Respondents

R-2: Chaganti Hari Vishnu, S/o. Veerabhadra Rao, D.No. 2-50/A, Near Vinayaka Temple, Rayapalli Village, Addateegala Mandal, A.S.R. District. ...2nd Respondent

పై నెంబరు పిటిషన్‌లో 2వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 01-4-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి 12-3-2025
జి.వి.వి.సత్యనారాయణ
అడ్వకేట్, రాజమండ్రి

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 30/2023

Between:
1. Satyavolu Sandhya
2) Satyavolu Suneetha ...Plaintiffs

AND

D-5: Thota Veera Venkata Manikumar, S/o. Veera Venkata Satyanarayana, Hindu, aged 27 years, Business, R/o. D.No. 13-171/1, Juvvaladoddi Village, Biccavolu Mandal, E.G.District. ...5th Defendant

పై నెంబరు దావాలో 5వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 25-3-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

జి.ఎస్.ఎస్.మురళీమోహన్
రాజమండ్రి 12-3-2025
జి.వి.రామలక్ష్మి
అడ్వకేట్స్, రాజమండ్రి